www. aknu.edu.in
nannayavani@aknu.edu.in
nannayanewstv
adikavi Nannaya University
9701293231

తొలి తెలుగు విశ్వవిద్యాలయ వారపత్రిక

# నన్నయ వాణి


ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

గౌరవ సంపాదకులు
ఆచార్య మొక్కా జగన్నాథరావు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య తుపాకుల అశోక్
కులసచివులు

సంపాదకులు
డా.తలారి వాసు — సహాయాచార్య, తెలుగు శాఖ
పువ్వల ఆనంద్ — ప్రజా సంబంధాల అధికారి, కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 1 | సంచిక : 20 | 22-02-2021 | పుటలు : 4

ఫిబ్రవరి 21

**అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ శుభాకాంక్షలు !!**

"మా తెలుగుతల్లికి మల్లెపూదండ!
మా కన్నతల్లికి మంగళారతులు!!

(చిత్రకారులు: హంపి,రాజమహేంద్రి)

– నన్నయవాణి

## మెటీరియల్ సైన్స్‌లో మెండైన అవకాశాలు

### వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు

**17.02.21** (మీడియాసెల్) మెటీరియల్ సైన్స్‌లో పరిశోధనలకు అవకాశాలు అపారంగా ఉన్నాయని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. బుధవారం యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ డిపార్టమెంట్ ఆఫ్ హుమానిటీస్ ఆధ్వర్యంలో నేషనల్ వెబినార్‌ను నిర్వహించారు. మేథో సంపత్తి హక్కులు సూచనలతో మెటీరియల్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్" అనే అంశంపై నిర్వహించిన ఈ వెబినార్‌కు అధ్యాక్షులుగా ప్రిన్సిపాల్ డా.వి.పెర్సిస్, కన్వీనర్‌గా డా.జి.కీర్తిమారిటా వ్యవహరించారు. ఈ నేషనల్ వెబినార్‌లో ఇంజినీరింగ్ విద్యార్థులంతా పాల్గొనేలా యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్‌లో ప్రత్యేక ఏర్పాటుతో ప్రత్యేక్ష ప్రసారం చేశారు. వెబినార్‌లో ముఖ్యఅతిథిగా హాజరైన వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు మాట్లాడుతూ మెటీరియల్ సైన్స్‌లో పరిశోధన లకు ఎక్కువ అవకాశాలు ఉన్నాయని, వాటిని భావి పరిశోధకులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. మెటీరియల్ సైన్స్ మెడికల్, ఇండస్ట్రీ, స్పెస్, సిరామిక్స్ వంటి అన్ని రంగాల్లోను కీలక పాత్రను పోషిస్తుందని చెప్పారు. కొత్త మెటీరియల్స్ ను సృష్టించడంలో అన్ని విభాగాలూ పురోగతిని సాధించాలన్నారు. మేధోసంపత్తి హక్కులను సాధించు కోవడం ద్వారా భారతదేశ ఖ్యాతి పెరుగుతుందన్నారు. అనేక పరిశోధనలు, శాస్త్ర, సాంకేతిక విజ్ఞాన ఆవిష్కరణలతో పాటు వాటి హక్కులను పొందుకోవాలని సూచించారు. కృతిమంగా వజ్రాలను తయారు చేసి వాటి నుండి ఎలక్ట్రానిక్ వస్తువులను ప్లాస్మా ఆధారంగా ఎలా పని చేస్తాయి, వాటి అభివృద్ధి గురించి సీనియర్ సైంటిస్టు సి.ఎస్.ఐ.ఆర్ ఇన్సిట్యూట్ ఆఫ్ మినరల్స్ అండ్ మెటీరియల్స్ టెక్నాలజీ భునేశ్వర్ కు చెందిన డా.కె.జె.శంకరన్ వివరించారు. అలాగే పెటెంట్స్ ను, కాపీరైట్స్ ను సాధించడం ఆవిష్కరణలపై హక్కులను పొందడం తద్వారా దేశాభివృద్ధి తదితర అంశాలపై డా.తోగాపూర్ పవన్ కుమార్ ఉపన్యసించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ప్రిన్సిపాల్ డా.వి.పెర్సిస్, కోర్సు కోఆర్డినేటర్ ఎం.బాలకృష్ణ, కోకన్వీనర్ డి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వెబినార్ వీక్షిస్తున్న విద్యార్థులు, మాట్లాడుతున్న వీసీ జగన్నాథరావు





క్యాలెండర్ చెట్టు నుంచి
రాలిపడ్డ తేదీలను చదువుకో..

సదస్సుల మెదళ్ళ నుంచి
చెదిరిపడ్డ వాదాలను చదువుకో....

లోతు ముట్టి చూడందే
చేతికందబోదు సుమా ఏ నిజం!!

– ఆచార్య సి.నారాయణరెడ్డి.

## విశ్వ విద్యాలయ అభివృద్ధికి కృషి చేస్తా

**కులసచివులు తుపాకుల అశోక్‌తో ఇంటర్వ్యూ**

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయానికి కులసచివులు (రిజిస్ట్రార్) బాధ్యతలను చేపట్టి సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు ఇంగ్లీష్ ఆచార్యులు....

ప్రొఫెసర్ తుపాకుల అశోక్ గారు. వారు విశ్వవిద్యాలయ వారపత్రిక నన్నయవాణి కి ప్రధాన సంపాదకులుగా ఉన్నారు.(వారితో ఎడిటర్ ముఖాముఖి)

**సర్. నమస్సులు ! తమ విద్యాభ్యాస విషయాలు తెలియచేయండి.**

మా స్వగ్రామం నెల్లూరు.ప్రాథమిక విద్య అంతా నెల్లూరులోనే జరిగింది. ఇంగ్లీష్‌లో ఎమ్. ఏ.,ఎమ్. ఫిల్., పిహెచ్.డి. కోర్సులన్నీ తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో పూర్తి చేశాను.



**ఏ అంశంపై పరిశోధన చేశారు.**

ఇంగ్లీష్ లో 'నైపాల్ రచనల్లోని వలసవాదం - నేపథ్యం' అనే అంశంపై పిహెచ్. డి. సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించాను. దానికి వెంకటేశ్వర విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రదానం చేసింది.

**ఉద్యోగ జీవితం....**

2007లో వై.ఎస్.ఆర్.ఆర్ లయోల డిగ్రీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించాను. 2012 లో తూర్పుగోదావరి జిల్లాలోని రాజోలు ప్రభుత్వ కళాశాలలో, 2013 లో ప్రకాశం జిల్లాలోని గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో అధ్యాపక సేవల్ని అందించి 2014 లో నాటి ఆంధ్ర విశ్వవిద్యాలయం కాకినాడ పిజి సెంటర్ లో అసోసియేట్ ప్రొఫెసర్ గా బాధ్యతల్ని చేపట్టాను.2017 ప్రొఫెసర్ గా ఉద్యోగోన్నతిని పొందాను.

**రిజిస్ట్రార్ గా మీ సేవలు...**

2017 - 18 విద్యా సంవత్సరంలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ గా సేవలందించే అవకాశం లభించింది.తరువాత తిరిగి కాకినాడలో ఆచార్యుడిగా ఉంటూ పీజీ సెంటర్ కి ప్రత్యేక అధికారి గా బాధ్యతలు నిర్వహిస్తున్న సమయంలో ప్రస్తుతం నన్నయ విశ్వవిద్యాలయానికి రెండవ పర్యాయం కులసచివులు (రిజిస్ట్రార్) బాధ్యతల్ని చేపట్టి సేవలందించే అవకాశం కల్పించిన మాన్య మహోదయులు ఉపకులపతి వర్యులు ఆచార్య మొక్కా జగన్నాథరావు గారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

**ఇంకేవైనా బాధ్యతల్ని నిర్వహించారా...**

ఎన్.ఎస్.ఎస్.ఆఫీసర్ గా,హాస్టల్ చీఫ్ వార్డెన్ గా, వి.జి. సెంటర్ ప్రత్యేకాధికారిగా బాధ్యతల్ని నిర్వహించాను.

**ప్రస్తుత కార్యాచరణ....**

విశ్వవిద్యాలయ ఉప కులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు గారికి విశ్వ విద్యాలయంలో న్యాక్ సాధన, పరిశోధన ప్రణాళికల విషయాల్లో, వారి విజన్ ని అనుసరించి తోడ్పాటునందిస్తున్నాను. విద్యా, పరిపాలనా సమర్థులైన వారి విశ్వవిద్యాలయ భవిష్యత్ ప్రణాళికను అనుసరిస్తూ ఉపకులపతి గారికి పూర్తి సహకారాన్ని అందించేపనిలో ఉన్నాను.

**న్యాక్ సాధన విషయాలు తెలియచేయండి...**

న్యాక్ (NAAC) క్రైటీరియా పనులు చాలా వరకు విశ్వవిద్యాలయ ఆచార్య బృందం పూర్తి చేసే పనిలోఉంది. త్వరలోనే యూనివర్సిటీ రిపోర్ట్ న్యాక్ కార్యాలయానికి సమర్పిస్తాం. దానినిబట్టి పీర్ టీమ్ విజిట్,న్యాక్ గుర్తింపు వంటివన్నీ త్వరలోనే సాధించే పనిలో ఉన్నాం.టీమ్ లలోని ఆచార్యులు చాలా సమయాన్ని కేటాయించి పని చేస్తున్నారు.. వి.సి.గారి ప్రోత్సాహ, సహకారాలతో విశ్వవిద్యాలయ అభివృద్ధిలో శక్తిమేరకు పని చేస్తానని తెలియజేస్తున్నాను.

సంతోషమండి. ఉభయగోదావరి జిల్లాల విద్యాభివృద్ధికి కృషిచేస్తున్న విశ్వవిద్యాలయ అధికారులుగా తమ సేవలు విశేషమైనవి.నన్నయవాణి తమకు కృతజ్ఞతల్ని అందిస్తుంది.నమస్కారం సర్.

థాంక్యూ. మళ్ళీకాలుద్దాం.

## సంపాదకీయం

# భాషాభిమానం




సమాజానికి మార్పు సహజమైంది. మార్పు చైతన్యానికి సంకేతం. మార్పుకు అడ్డంకులు కల్పించే ఏ సమాజమూ చైతన్యవంతమైంది కాలేదు. 'పుంజుకుని నడిచేవాడికే పుట్టగతులు ఉంటాయి' అనే సామెత మనిషికి ఎంత వర్తిస్తుందో భాషకు కూడా అంతే వర్తిస్తుంది.మనం అభివృద్ధి చెందాలి కనుక మన భాష కూడా అభివృద్ధి చెందాలి. మన భాష పెరగాలి కనుక మనం అభివృద్ధి చెందాలి. మనం అభివృద్ధి చెందనిదే భాష అభివృద్ధి చెందదు,మన భావమూ అభివృద్ధి చెందదు.

భాష భావాన్ని వ్యక్తీకరించడానికి పుట్టింది. భావాలు ఎంత పెరిగితే భాష అంత పెరుగుతుంది. భావాలు ఎంత సూక్ష్మమైతే అయితే భాష అంత సూక్ష్మమవుతుంది. అంత సునిశితమవుతుంది. మనిషి ఆలోచనకు భాష అభివ్యక్తీకరణ సాధన.మనిషి సహజంగా అలవాటైన భాషలోనే రాస్తాడు. అలవాటు లేనిది ఏదైనా కొత్తదే అవుతుంది. కఠినమవుతుంది. కాబట్టి సహజమైన భాషలోనే రచన సాగాలి. ఏ భాష అయినా సహజమైన భాష కావాలంటే ఆ భాషకు చెందిన దేశంలో, దేశీయమైన ఆలోచన, విద్య,విజ్ఞానాలు పెరగాలి. అటువంటి విద్య,విజ్ఞానం ఆ భాష ద్వారా వాడుకలోనికి రావాలి.

ప్రాచీన భారతీయ భాష సంస్కృతం. చాలామంది దానిని మృత భాష అంటారు. ఆ భాష విస్తృతంగా వ్యవహారంలో లేకపోవచ్చు. వాడుక భాషగా ఉండకపోవచ్చు. కానీ ఎన్నో భాషల్లో అది ఇప్పటికీ బ్రతికే ఉంది. సంస్కృతం నుండి వచ్చిన పదాలు ఎన్నో భాషలలో ఇమిడిపోయాయి. ఏ భాషా కూడా ఎప్పటికీ ఉన్నదున్నట్లుగా ఉండిపోదు. జ్ఞానమూ, విజ్ఞానమూ ఉన్నవి ఉన్నట్లుగానే ఉండవు. కాలంతోపాటు జ్ఞానంతోపాటు సమాజం కూడా మారుతూ ఉంటుంది. జ్ఞాన విజ్ఞానాలు మారుతూ ఉంటాయి. పాత భాష కొత్తభాషలో ఇమిడిపోతూ ఉంటుంది. పాత భాష మారుతూ కొత్త భాషలో కొత్త భాషలో ఇమిడిపోతుంది. దానిని మనం ఆపలేం. ఆపకూడదు కూడా. కాబట్టి పాతదంతా పాతగా ఎప్పుడూ ఉండదు. కొత్తది పాతదానిని ఆకట్టుకుని ఆకళింపు చేసుకోకుండా, పాతదానిపై ఆధారపడకుండా కొత్త కానేరదు. ఇది లోకం యొక్క,కాలం యొక్క, జ్ఞానం యొక్క, జీవితం యొక్క లక్షణమే కాదు, లక్ష్యం కూడా.

కనుక జాతికి భాషా వ్యామోహం కన్నా, జ్ఞాన వ్యామోహం చాలా పెరగాలి. జ్ఞానం పెరిగినప్పుడు భాష దానంతటదే పెరుగుతుంది. భాష పట్ల వ్యామోహం కన్నా అభిమానం చాలా ముఖ్యం. ఆ అభిమానమే భాషను బ్రతికిస్తుంది. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా భాషాభిమానులకు అభివాదాలు.


# నన్నయలో నేషనల్ సైన్స్ డే పోటీలు

**వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు**


**17.02.21 (మీడియాసెల్)** ంఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో సైన్స్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో నేషనల్ సైన్స్ డే సందర్భంగా వివిధ పోటీలను నిర్వహిస్తున్నారని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు తెలిపారు. దీనికి సంబంధించిన బ్రోచర్ ను వీసీ ఆవిష్కరించి వివరాలను తెలియజేసారు. "ఫ్యూచర్ ఆఫ్ సైన్స్ టెక్నాలజీ అండ్ ఇనోవేషన్, ఇంపెక్ట్స్ ఆన్ ఎడ్యుకేషన్, స్కిల్స్ అండ్ వర్క్" అనే అంశంపై వివిధ పోటీలను సైన్స్ కళాశాలలోని ఆయా విభాగాల వారు నిర్వహిస్తున్నారని అన్నారు. క్విజ్ బోటని అండ్ ఫిజిక్స్ విభాగాలు, పిపిటి/డాక్యుమెంటరీ మెథమెటిక్స్, పోస్టర్ ప్రెజెంటేషన్ లైఫ్ సైన్సెస్, ఎలోక్యూషన్ కెమిస్ట్రీ, వ్యాస రచన జియోలజీ విభాగాల వారు నిర్వహిస్తారని తెలిపారు. వీటిలో ప్రతిభ కనపరచిన విద్యార్థులకు నేషనల్ సైన్స్ డే సెలబ్రేషన్స్ లో బహుమతులను అందిస్తామని తెలియజేసారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ క్యాంపస్ కళాశాలల విద్యార్థులంతా ఈ పోటీలలో పాల్గొనవచ్చునని పేర్కొన్నారు. ఈ పోటీలకు కన్వీనర్ గా డా.కె.రమణేశ్వరి, ఆర్గనైజర్స్‌గా డా.బి.జగన్మోహనరెడ్డి, డా.పి.విజయనిర్మల, డా.కె.నూకరత్నం, డా.ఎల్.ముత్యాల నాయుడు, వై.సుష్మప్రియ, డా.కె.రేవతి వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, లీగల్ ఆఫీసర్ నందెపు నాగేంద్రరావు, నిర్వహకులు పాల్గొన్నారు.


బ్రోచర్ ను ఆవిష్కరిస్తున్న వీసీ జగన్నాథరావు


# సన్నిధానం వారి పుస్తక దానం



రాజమహేంద్రవరానికి చెందిన ప్రముఖ పాత్రికేయులు, సాహితీవేత్త సన్నిధానం శాస్త్రి తెలుగు సాహిత్యానికి సంబంధించిన గ్రంథాలను నన్నయ విశ్వవిద్యాలయానికి బహూకరించారు. ఈ సందర్భంగా వి.సి.ఆచార్య మొక్కా జగన్నాథరావు, రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. విశ్వవిద్యాలయానికి సాహిత్య గ్రంథాలను సేకరిస్తున్న తెలుగుశాఖ అధ్యాపకులు డా.తలారి వాసు ను అభినందించారు.




## మంచి మాట



చెడ్డ పనులు చేసేవారిని వదిలేసి, మంచి చేస్తున్న మిమ్మల్ని ఎవరైనా సందేహిస్తుంటే బాధపడకండి. విలువైన బంగారాన్నే అందరూ పరీక్షిస్తారు కానీ, హీనమైన లోహాన్ని కాదు కదా !!

# నాగేంద్ర కిషోర్‌కు జ్ఞాపిక అందజేత


జ్ఞాపికను అందిస్తున్న వీసీ జగన్నాథరావు

**20.02.21 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ విశ్వ విద్యాలయంలో విభాగాలవారీగా పూర్వ విద్యార్థుల అలుమ్ని అసోసియేషన్ల స్థాపనకు, సంబంధిత పూర్వ విద్యార్థులలో పరస్పర సంఘీ భావం, సహాయ సహకారాలు, సమన్వయం పెంచే దిశగా పూర్వ విద్యార్థుల సంఘాల ఏర్పాటుకి వైస్ ఛాన్సలర్ మొక్కా జగన్నాథరావు ఆశయాలకు అనుగుణంగా, నన్నయలో వివిధ డిపార్ట్మెంట్స్ పూర్వ విద్యార్థులను చైతన్యపరచి, అలుమ్ని స్థాపనకు స్ఫూర్తిదయాక కృషి చేస్తున్నా, ఆదికవి నన్నయ స్పృహ సైకాలజీ అలుమ్ని సంఘ అధ్యక్షులు సుంకర నాగేంద్ర కిషోర్‌ని వీసీ జ్ఞాపికతో అభినందించారు. నాగేంద్ర కిషోర్ ప్రిన్సిపాల్స్, ప్రొఫెసర్ లు అందిస్తున్న సేవలను వీసీకి వివరించారు. వివిధ డిపార్ట్మెంట్ వారు విద్వాన్ (ఎడ్యుకేషన్), శ్రీవాణి (తెలుగు), ప్రాకృత్యం (బోటనీ), పృథ్వి (జియాలజీ)ల నామకరణంతో ప్రారంభమయ్యాయి. పూర్వ విద్యార్థుల సంఘాల స్థాపనకు నాంది పలికిన స్పృహ సైకాలజీ సంఘాన్ని వీసీ అభినందనందించారు.




ప్రతిభా వాణి


## గిడుగు వెంకట సీతాపతి

(జనవరి 28, 1885- ఏప్రిల్ 19, 1969)



ప్రసిద్ధ భాషా పరిశోధకుడు. విజ్ఞాన సర్వస్వ నిర్మాత. గిడుగు వెంకట రామమూర్తి గారి కుమారుడు సీతాపతి గారు. పలు గేయాలను పిల్లలకోసం రాసిన సాహిత్యవేత్త. వీరి బాల సాహిత్యంలో ప్రాచుర్యం పొందినది చిలకమ్మపెళ్ళి. మద్రాసు క్రైస్తవ కళాశాలలో చరిత్రలో పట్టభద్రులై కొంతకాలం పర్లాకిమిడిలో చరిత్రో పన్యాసకులుగా పనిచేశారు. చరిత్ర–రాజనీతి సంపుటం సంపాదక వర్గంలో ప్రముఖపాత్ర వహించారు. వ్యావహారిక భాషోద్యమంలోను, సవర భాషోద్ధరణ లోను తండ్రికి కుడిభుజంగా నిలిచి విశేషానుభవం గడించారు. రైతుబిడ్డ, స్వర్గసీమ, పల్నాటి యుద్ధం, భక్తిమాల వంటి కొన్ని చలనచిత్రాలలోను, కొన్ని నాటకాలలోను నటించారు. 1945లో మాగంటి బాపినీడు సంపాదకత్వంలో వెలువడిన ఆంధ్ర సర్వస్వముకు అనేక వ్యాసాలు రచించి విశేషంగా తోడ్పడ్డారు. 1949లో తెలుగు భాషా సమితి ఏర్పడినపుడు తెలుగు విజ్ఞాన సర్వస్వపు ప్రధాన సంగ్రాహకులుగా నియమితుల య్యారు. తెలుగులో సూర్యరాయాంధ్ర నిఘంటువుకు చివరిదశలో వీరు గౌరవ సంపాదకులుగా పనిచేశారు. కేంద్ర సాహిత్య అకాడమీ సంకలితం చేసిన భారతీయ గ్రంథసూచిలో తెలుగు విభాగానికి వీరు సంపాదకత్వం వహించారు. వీరు రచించిన తెలుగు కావ్యాలలో ముఖ్యమైనవి 'భారతీ శతకము', 'సరస్వతీ విలాసము', 'కొద్ది మొఱ్ఱ'. వీరు రాసిన 'బాలానందము' వంటి బాల సాహిత్య రచనలు విశేష ప్రజాదరణ పొందాయి. వీరు బైబిల్ లోని మూడు సువార్తలను సవర భాషలోకి అనువదించారు. కేంద్ర సాహిత్య అకాడమీ వారి అభ్యర్ధనపై తెలుగు సాహిత్య చరిత్రను ఇంగ్లీషులోకి అనువదించారు. వీరు రచించిన 'తెలుగులో ఛందోరీతులు' అనే గ్రంథానికి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ పురస్కారం లభించింది. వీరికి ఆంధ్రవిశ్వకళాపరిషత్ "కళాప్రపూర్ణ" బిరుదాన్నిఇచ్చి గౌరవించింది. వీరి ఇంగ్లీషు రచనలలోని విశిష్టతను గుర్తించి వాషింగ్టన్ లోని అంతర్జాతీయ అకాడమీ వీరికి డి.లిట్. గౌరవం ఇచ్చింది. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భాన ఈ భాషా సేవకునికిదే నన్నయవాణి అక్షర నీరాజనం!!

## మేనేజిరియల్ ఎకనామిక్స్ పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆష్కరించిన వీసీ జగన్నాథరావు

**19.02.21 (మీడియాసెల్)** "మేనేజిరియల్ ఎకనామిక్స్" అనే పుస్తకాన్ని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు ఆవిష్కరించారు. శుక్రవారం విశ్వవిద్యాలయంలో పుస్తకాన్ని ఆవిష్కరించి వివరాలను తెలియజేసారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం కాకినాడ్ ఎం.ఎస్.ఎన్ క్యాంపస్‌లో ఎంబీఏ అధ్యాపకులుగా పని చేస్తున్న డా.ఎం.శ్రీదేవి, డా.ఈ.అప్పారావు "మేనేజిరియల్ ఎకనామిక్స్" అనే పాఠ్యాంశ పుస్తకాన్ని రచించారని అన్నారు. విశాఖపట్నం శ్రీపబ్లికేషన్ వారు ప్రచురించిన ఈ పుస్తకం బిబిఏ, బిబిఎం, బికాం వంటి డిగ్రీ కోర్సుల విద్యార్థులకు, ఎంఏ ఎకనామిక్స్, ఎంకామ్, ఎంబీఏ వంటి పీజీ కోర్సుల విద్యార్థులకు ఉపయోగపడుతుందని తెలిపారు. రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ మాట్లాడుతూ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్, ఎకనామిక్స్ విద్యార్థులకు ఉపయోగపడే విధంగా మేనేజిరియల్ ఎకనామిక్స్ పాఠ్యపుస్తకాన్ని రూపొందించిన అధ్యాపకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ టి.అశోక్, మేనేజ్మెంట్ ఆచార్యులు ఎస్.టేకి, డా.ఎం.శ్రీదేవి, డా.ఈ.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

# మధురస్మృతి - జీవన స్ఫూర్తి



నమస్సులు. విశ్వవిద్యాలయంలో చదవాలని నేను ఎంతో ఉవ్విళ్ళూరాను. నా ఆశయసిద్ధి కోసం మొదలుపెట్టిన ప్రయాణం చాలా అనూహ్య రీతిలో ప్రారంభమైంది... ఆ రోజు 2-5-2017 తేదీ, నాకు ఇప్పటికీ గుర్తుంది... నాకు గైట్ కాలేజీలో ఐసెట్ పరీక్ష వచ్చింది... దీనితో విశ్వవిద్యాలయంలో చదవాలనుకునే నా కోరిక నెరవేరుతుందని అనేక ఊహాలతో స్కూటి పై బయలుదేరిన నేను దురదృష్టవశాత్తు ఒక ప్రమాదంలో పడ్డాను. ముక్కుముఖం రక్తసిక్తమైంది, ఇది నాకు దాదాపు పరీక్షా సమయం. గాయాలతో ఇంటికి వెళ్లడమా ? ధైర్యంతో ముందుకు వెళ్లి పరీక్ష రాయడమా ? నాలక్ష్యం ఏవిధంగనైనా విశ్వవిద్యాలయంలో చేరడమే. కాబట్టి నేను దైవాన్ని స్మరిస్తూ ధైర్యంగా అక్కడే ప్రథమచికిత్స తీసుకొని విపరీతమైన బాధను పండ్లతో బిగబట్టి పరీక్షవ్రాయాలని నిర్ణయించుకున్నాను. ఇది నేను నా జీవితం లోతీసుకున్న ఉత్తమ నిర్ణయం అని భావిస్తున్నాను. నేను రెండున్నర గంటలు పడిన బాధ ఫలవంతమై. నాకు నన్నయ విశ్వవిద్యాలయంలో సీటు వచ్చింది. చివరికి 16-8- 2017 న కళాశాలలో మొదటి రోజు నా కల నిజమైనందుకు పరమానందం కలిగింది... అందరూ చాలా బాగున్నారు... నేను చాలా మంది కొత్త వారిని కలుసుకున్నాను, వారందరినీ నా స్నేహితులుగా చేసుకొన్నాను. మా అధ్యాపకులు మాకు ఉత్తమ విజ్ఞాన్నిఅందిచ్చారు. ఇంకా ఇతరవిషయాలు నేర్చుకోవడానికి యూనివర్శిటీలో గొప్ప లైబ్రరీ ఉంది. మేము లైబ్రరీలో గంటలపాటు కలిసి కూర్చుని పరీక్షల కోసం అవసరమైన పాఠ్యాంశాలు తయారు చేసుకొనేవాళ్ళము. పరీక్షలు జరిగిమాకు గొప్ప ఫలితాలు వచ్చాయి. నేను మా తరగతిలో 1వ స్థానంలో ఉన్నాను... ఈ ర్యాంక్ యొక్క వారసత్వం నేను 4 వ సెమిస్టర్‌వరకు నిలబెట్టుకున్నాను.

మా ప్రొఫెసర్ టేకిసర్, ఐఎస్ఎన్ రాజు సర్, రవిశంకర్ సార్, జోహార్ కృష్ణ సర్, వెంకట్ సర్, డాక్టర్ ఉమా మహేశ్వరి మామ్, డాక్టర్ ఉదయ్ భాస్కర్ సర్, డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ సర్, డాక్టర్ సుజాతా మామ్ (ఎకనమిక్స్ ) ఎల్లప్పుడూ మాకు మద్దతు ఇచ్చి ప్రోత్సహించి ఉత్తమఫలితాలు సాధించడానికి దోహదపడ్డారు. వారికి నేను సర్వదా కృతజ్ఞురాలిని. ఈ విశ్వవిద్యాలయం ఒక ప్రత్యక్ష ప్రయోగ జ్ఞాన సముపార్జన నిలయం. ఇక్కడ కేవలం చదవడమే కాకుండ ప్రత్యక్ష సాధన ద్వారా పాఠాలు నేర్చుకుంటారు. "మేనేజ్‌మెంట్ ఫెస్ట్‌లు" నిర్వహించడం నిజంగా గొప్ప అనుభవమే... దీనివల్ల కొన్ని క్లిష్ట పరిస్థితులలో ఎలా ప్రవర్తించాలో నేర్చుకున్నాను. భవిష్యత్తును ఎలా అంచనా వేయాలో కూడా నేర్చుకున్నాను. సమస్యలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండడం తెలుసు కున్నాను. నా మధుర స్మృతి. 2 కె 18 ప్రారంభోత్సవానికి మేనేజ్‌మెంట్ ఫెస్ట్‌లో నేను "యూనివర్శిటీ పాట"కు సెమీ క్లాసికల్ డ్యాన్స్ కంపోజ్ చేశాను. దానిని ఎన్‌టిఆర్ కన్వెన్షన్ హాల్‌లో స్వయంగాప్రదర్శించాను. ఒక ముస్లిం అయి ఉండి ఈ ప్రదర్శన ఇచ్చినందుకు ఆశ్చర్యపడి అందరి నుండి ఎన్నో ప్రశంసలు, అభినందనలు లభించాయి. టేకిసర్ ఆ రోజు నాకు ఒక మొక్కను బహుమతిగా ఇచ్చారు, ఇది ఇప్పటికీ నా ఇంట్లో పచ్చగా పెరుగుతోంది. స్నేహితులతో మనకు ఎల్లప్పుడూ సరదాగా ఉంటుంది. కానీ విశ్వవిద్యాలయంలో నాలాగా

స్ఫూర్తి

నాస్నేహితులతో సరదాతో పాటు మంచి విజ్ఞానం పొందడం చాలా అరుదు.. మాకోర్సు ఎం.బి.ఏ.లో టూరిజం మరియు హాస్పిటాలిటీలో ప్రత్యేకత కదా.. మేము బెంగులూరు ఊటి మరియు కూర్గ్ లకు ఒక పర్యటన ప్రణాళిక సిద్ధంచేశాము, దీనిని విద్యార్థులు విజయవంతంగా నిర్వహించారు. నా కోర్సు పూర్తయిన తర్వాత కూడా నేను సంబర పడడానికి విశ్వవిద్యాలయం చాలా ఉత్తమమైన మధురానుభూతులు అందించింది. వంబర్ 11, 2019న నేను అన్ని సెమిస్టర్లలో అగ్రస్థానంలో ఉన్నాను. 2017-2019 బ్యాచ్‌లో యూనివర్శిటీ టాపర్‌గా ఉన్నాను. ప్రతిభా అవార్డు 2019 కోసం నేను సాధారణ విభాగంలో ఎంపికయ్యాను. MBA లో ఇది నిజంగా నా గొప్ప విజయాల్లో ఒకటి. నేను 4వ సెమిస్టర్ ప్రాజెక్ట్ పనుల కోసం రాజమండ్రి విమానాశ్రయంలో ఇంటర్న్‌షిప్ చేశాను. ఏవియేషన్ పరిశ్రమ నా కోర్సు కాబట్టి దాని గురించి ప్రత్యక్షంగా నేర్చుకోవడం నాకు చాలా సహాయపడింది. ఇప్పుడు నేను ఆంధ్ర లయోలా డిగ్రీ కాలేజీలో ఏవియేషన్ మేనేజ్‌మెంట్‌లో లెక్చరర్ గాపనిచేస్తున్నాను. నా కోర్ స్టడీస్‌కు సంబంధించిన సబ్జెక్టులో త్వరలో పీహెచ్.డీ. పూర్తి చేయాలని అభిలషిస్తున్నాను. విశ్వవిద్యాలయంలో సీటు పొందడం నా సంకల్ప శక్తి. అవార్డులను పొందడం నా కృషి. ఇంత గొప్ప ఉపాధ్యాయుల ఆశీర్వాదం లభిచడం. విలువైన స్నేహితులను సంపాదించడం నా అదృష్టం. నాఅనుభవంతో ముందు తరం విద్యార్థులకు నేను తెలియజేసేదేమిటంటే ఒకోసారి మన లక్ష్య సాధనలో అనేక ఇబ్బందులు ఎదురు కావచ్చు. కానీ సహనంతో ధైర్యంతో వాటిని ఎదుర్కొని పరిష్కరించకుంటే మనకు తప్పకుండా విజయం సిద్ధిస్తుంది... యూనివర్సిటీలో చదివిన భావిభారత పౌరులందరూ ఎంతో విజ్ఞానం సాధించి దేశ సేవకు ఉపయోగపడాలని నా ఆకాంక్ష !అభిలాష!!

**- సయ్యద్ జీనత్ భాను.**
**అధ్యాపకులు,ఆంధ్ర లయోలా డిగ్రీ కళాశాల.**

## వీసీని కలిసిన పట్టపగలు వెంకట్రావు


పట్టపగలు వెంకట్రావును సన్మానిస్తున్న వీసీ జగన్నాథరావు

**19.02.21 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావును ప్రముఖ సామాజికవేత్త పట్టపగలు వెంకట్రావు మర్యాదపూర్వకంగా కలిశారు. విశ్వవిద్యాలయంలో శుక్రవారం వీసీని మర్యాదపూర్వకంగా కలిసి విశ్వవిద్యాలయ అభివృద్ధిపై పలు అంశాలను చర్చించారు. విశ్వవిద్యాలయంలో ఇటీవల జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, విద్యా పరమైన అంశాలను గురించి వీసీ వివరించారు. పట్టపగలు వెంకట్రావు చేస్తున్న సమాజ హితమైన కార్యక్రమాలు హర్షణీయమని ఆయనను సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ ఉభయగోదావరి జిల్లాలకు విద్యాప్రధాయినిగా ఉన్న ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు పాలనలో విశ్వవిద్యాలయం మరింత అభివృద్ధి దిశగా పయనిస్తుందన్నారు. ప్రణాళికబద్ధంగా లక్ష్యాలను సాధించి రాష్ట్రంలోనే ఉన్నత విశ్వవిద్యాలయంగా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాంలో అడ్వకేట్, సైకాలజీ పూర్వ విద్యార్థి బాడిస శ్రీనివాసరావు పాల్గొన్నారు.



# విశ్వ విద్యాలయ క్రీడా వైజయంతిక !!



ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉన్న ఉభయ గోదావరి జిల్లాలలోని కళాశాలల్లో ఉన్న వ్యాయామ విభాగాలతో విశ్వవిద్యాలయ స్పోర్ట్స్ బోర్డ్ అనేకమైన క్రీడా కార్యక్రమాలను నిర్వహిస్తుంది. ఈ క్రీడలలో విద్యార్థులు విశేషమైన ప్రతిభ కనబర్చేలా వారికి విశ్వవిద్యాలయంలోని వ్యాయామ అధ్యాపకులు, డిగ్రీ కళాశాలలో వ్యాయామ అధ్యాపకులు సమిష్టి కృషితో వారికి శిక్షణిచ్చి, అభ్యాసాలను చేయిస్తూ ఉంటారు. ఆ విద్యార్థులు రాష్ట్ర, దేశ వ్యాప్తంగా జరిగే క్రీడలలో పాల్గొని అనేకమైన మెడల్స్ సంపాదిస్తున్నారు. దీనితోపాటు ఎంతోమంది విద్యార్థులు స్పోర్ట్స్ కోటాలో ప్రభుత్వ ఉద్యోగాలను కైవసం చేసుకుంటున్నారు. వారందరికీ నన్నయవాణి శుభాకాంక్షలు అందిస్తోంది. ఈ క్రీడా రంగానికి చెందిన అందరికీ అభివాదాలను, అభినందనలను తెలియజేస్తోంది.















## 2020 విజయాలు

- వెయిట్ లిఫ్టింగ్ (పురుషులు) గోల్డ్‌మెడల్
- కిక్ బాక్సింగ్ బ్రాంజ్ మెడల్స్ (3)
- రోప్ స్కిప్పింగ్ 2.3. స్థానాలు
- క్రికెట్ 4వ స్థానం
- వెయిట్ లిఫ్టింగ్ (మహిళ) గోల్డ్‌మెడల్ 2019
- వెయిట్ లిఫ్టింగ్ (పురుషులు) బ్రాంజ్ 2019



### డాక్టర్ బాసంశెట్టి రాంగోపాల్

అసిస్టెంట్ డైరెక్టర్, ఫిజికల్ ఎడ్యుకేషన్.
సెక్రటరీ, స్పోర్ట్స్ బోర్డ్ AKNU.

ఇంటర్ కాలేజీయేట్ టోర్నమెంట్స్ కి షెడ్యూల్ విడుదల చేయబోతున్నాం. దాని గురించి ఈవెంట్స్ నిర్వహించి విశ్వవిద్యాలయం తరపున పోటీ చేయడానికి బెస్ట్ టీమ్స్‌ని ఎంపిక చేసే పనిలో ఉన్నాం. దేశవ్యాప్తమైన పోటీలకు విశ్వవిద్యాలయ, ఉభయ గోదావరి జిల్లాల కళాశాల క్రీడాకారులను సిద్ధం చేస్తున్నాం.

### స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు పొందిన విద్యార్థులు

రైల్వే
సోషల్ వెల్ఫేర్
పంచాయతీ రాజ్
ట్రైబల్ వెల్ఫేర్
స్కూల్ ఎడ్యుకేషన్
హెూమ్ డిపార్ట్‌మెంట్
రంగాల్లో....

**35 మంది**

### ఈవెంట్స్‌ను కండక్ట్ చేస్తూనే ఎక్కువగా ఈవెంట్స్ లో పాల్గొంటున్న కళాశాలలు

- SSRCCPE గోపన్నపాలెం.
- DRK REDDY గొల్లలమామిడాడ
- నోవా కళాశాల వేగవరం జంగారెడ్డిగూడెం
- సెయింట్ థెరిసా ఏలూరు
- సి.ఆర్.రెడ్డి కళాశాల ఏలూరు
- అరవింద త్రిశతజయంతి కళాశాల, నారాయణపురం.
- ప్రభుత్వ కళాశాల నిడదవోలు.
- SKSD మహిళా కళాశాల తణుకు.
- DNR కళాశాల,భీమవరం.
- బి.వి. రాజు కళాశాలలు, భీమవరం.
- చాంబర్స్ డిగ్రీ కళాశాల పాలకొల్లు.
- DNR ఉమెన్స్ పాలకొల్లు.
- శ్రీ వై. ఎన్. కళాశాల నరసాపురం.
- MVN,JS& RVR కళాశాల, మలికిపురం.
- ఐడియల్ కళాశాల, కాకినాడ.
- ఆదిత్య కళాశాల కాకినాడ.
- MSN క్యాంపస్, కాకినాడ.
- విశ్వవిద్యాలయ ప్రాంగణ కళాశాలలు.





















